# అభిప్రాయాలు

'శేషయ్యా ?'

'ప్రభూ !'

'నీది వరహాల బుర్రోయ్—'

'మళ్ళీ యేదో కొత్త పుట్టిమునక ! లేకపోతే నాపాడు బుర్ర గొడవ—'

'ఈ నల్లకోటు చూడు—ఇప్పుడే తెచ్చాడు దర్జీ.'

'చూశానండి.'

'ఈ తెల్ల పంట్లాం ?'

'అదీ కనిపిస్తూనే వుందండి !'

'కనిపించడం కాదోయ్—బాగున్నాయని అనవేం ?'

'విషమ సమస్య తెచ్చి పెట్టారు !'

'నీ నిజాభిప్రాయం చెప్పు—కోప్పడనులే—'

'మీరు కోప్పడరు గదా అని వెధవనై పోవడం నాకిష్టం లేదు !'

'మారాం చెయ్యకు శేషయ్యా—నీకెలా తోస్తే అలా చెప్పు—ఈ తెల్ల పంట్లాంమీదికి ఈ నల్లకోటు బావుందా అని నాప్రశ్న. ఇందులో విషమూ లేదు, సమస్యా లేదు. సూటిగా చెప్పు—అయిదు నిముషాలు టైమిచ్చా—'

'............'

'ఏం ? ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటు......?'

'బంగారు గుడ్లు పెట్టడానికి కోడికి తగినంత సావధానం యివ్వాలండి. ఇలా తొందర చేస్తే...'

'ఇచ్చాం—మరో అయిదు నిముషాలు !'

'............'

'ఏం—ఇంక గుడ్డు పెట్టగలవా ?'

'పొట్ట చీల్చినా...'

'శేషయ్యా, కొరడా...'

'దేవిగా రొస్తున్నారు—ఆమె నడగండి. ఆవిడ అభిప్రాయమే నా అభిప్రాయం—'.

* * *

'దేవి శుద్ధ మూర్ఖురాలు! ఈ తెల్ల పంట్లాంమీదికి ఈ నల్లకోటు బాగు లేదంటూంది!'

'చిత్తం.'

'నువ్వు అలానే అభిప్రాయపడుతున్నావా?'

'దేవిగారి అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తున్నారా లేదా అనేదాని మీద అధారపడి వుంటుందండి నా సమాధానం!'

'వెర్రివాడా! నీవంటి మంత్రివుండీకూడా ఆ మూర్ఖురాలి అభిప్రాయంతో ఏకీభవించీ మాటైతే నా గొప్పేమిటీ?'

'నిజమేనండి'

'ఏమిటీ నిజం?'

'నేను వెర్రివాడినేనండి!'

'అది అలావుంచు—నే ననేది దేవి అభిప్రాయంతో ఏకీభవిస్తే నా గొప్పేమిటని?'

'అంతేనండి.'

'ఏమిటంతే?'

'మీ గొప్పేమిటని?'

'శేషయ్యా!'

'అది కాదండి, కోప్పడకండి. మీకు గొప్పలేదని ఎవరూ అనటం లేదు—'

'మరేమిటీ?'

'మరే ముందండి—మీరన్నదే — దేవిగారి అభిప్రాయంతో ఏకీభవిస్తే మీ గొప్పేమిటని—'

'రైట్ ! సరియైన మాట అన్నావు !'

'నే ననలేదండి—మీరే !'

'ఎవరో ఒకరు—నిజమంతేగా?'

'నా జవాబుకోసం ప్రభువులు ఆగ నక్కర్లేదండి—తమరు చెప్ప దలుచుకున్న దేదో—'

'చెప్పమన్నావా ?'

'చెప్పక వూరుకుంటారా ?'

'ఈ తెల్ల పంట్లాం మీదికి ఈ నల్లకోటే బావుందని నా అభి ప్రాయం—'

'కావచ్చునండి !'

'ఏమిటి కావచ్చు ?'

'మీ అభిప్రాయం మీదే కావచ్చునండి !'

'దేవి అభిప్రాయం ఇది కాదు—'

'కాక పోవచ్చునండి !'

'ఈ తెల్ల పంట్లాం మీదికి ఈ నల్లకోటు బాగులేదంటుంది దేవి—'

'అన్నారండి—అంటారండి !'

'దేవి !'

'చిత్తం—'

'మూర్ఖురాలు !'

'వింటున్నానండి !'

'ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటు బాగులేదుట !'

'చిత్తం—'

'ఏమిటి చిత్తం ?'

'ఆ తెల్ల పంట్లాం మీదికి ఆ నల్లకోటు నా మొహంలా వుంటుంది

———